క్లుప్తంగా

నేటి నుంచి ఉండి రైల్వే గేటు మూసివేత

ఉండి: ఉండి రైల్వే గేటు ట్రాక్ మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం నుంచి 18వ తేదీ బుధవారం రాత్రి వరకు రైల్వే గేటు మూసివేస్తున్నట్లు ఉండి ఎస్సై ఎండీ నసీరుల్లా తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారుప రైల్వే గేటు మూసివేస్తున్న దృష్ట్యా ట్రాఫిక్‌ను మళ్లించామని, భీమవరం నుంచి ఉండి మీదుగా ఆకివీడు వెళ్లాల్సిన వాహనాలు పెదమిరం వంత నుంచి కాళ్ల, ఏలూరుపాడు మీదుగా వెళ్లాలని పేర్కొన్నారు. ఆకివీడు నుంచి ఉండి మీదుగా భీమవరం వెళ్లాల్సిన వాహనాలు ఆకివీడు ఏలూరుపాడు, కాళ్ల, పెదఅమిరం వంత మీదుగా భీమవరం వెళ్లాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. గణపవరం నుంచి ఉండి మీదుగా ఆకివీడు వెళ్లే వాహనాలు పాముల పర్రు, పెదకాపవరం మీదుగా ఆకివీడు వెళ్లాలని ఎస్సై తెలిపారు.

యండగండిలో ఉచిత నేత్ర వైద్య శిబిరం



ఉచిత నేత్రవైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

ఉండి: మండలంలోని యండగండి జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. భీమవరానికి చెందిన ఊడియల్ విజన్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో డాక్టర్ పెన్మత్స కృష్ణ చైతన్య రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున గ్రామస్తులు కంటి పరీక్షలు చేయించుకున్నారు.

బెల్టు షాపులపై దాడి



వడలిలో బెల్ట్ షాపు నిర్వాహకుడితో అధికారులు

పెనుగొండ: మండలంలోని వడలిలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న ఉప్పలపాటి బ్రహ్మయ్యను అరెస్ట్ చేసి, 8 మద్యం బాటిల్లు స్వాధీనం చేసుకున్నట్లు తణుకు ప్రోహిబిషన్ ఎక్సైజ్ సీఐ ఎస్.మణికంఠరెడ్డి తెలిపారు. ఆదివారం గ్రామంలో తనిఖీలు నిర్వహించామన్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో ఎస్సై బి.లక్ష్మీ, హెచ్‌సీ కె.అప్పలస్వామి, వై.శ్రీమన్నారాయణ, సిబ్బంది జి.ఫణి భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: పట్టణ ఎక్సైజ్ స్టేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో మండలంలోని చింతపర్రు గ్రామంలో మద్యం సీసాలు విక్రయిస్తున్న ఎ.నాగేశ్వరరావును అదుపులోకి తీసుకున్నామని ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం జరిపిన దాడుల్లో నాగేశ్వరరావు నుంచి 5 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని, నిందితుడిపై కేసు నమోదు చేశామని వివరించారు. కార్యక్రమంలో ఎస్సైలు జి.రఘు, పి.మహేష్ పాల్గొన్నారు.

మూతపడ్డ మరుగుదొడ్లు

అత్తిలి: బస్టాండ్‌లో మరుగుదొడ్లు శనివారం మూసివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అత్తిలిలో బస్టాండ్‌లో మాత్రమే మరుగుదొడ్డి సదుపాయం ఉంది. ప్రయాణికులతో పాటు స్థానిక వర్తక దుకాణదారులు బస్టాండ్‌లో ఉన్న మరుగుదొడ్డినే వినియోగిస్తుంటారు. అయితే మరుగుదొడ్లకు తాళాలు వేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ప్రస్తుతం అత్తిలిలో షష్ఠి తిరునాళ్ల నిర్వహిస్తున్న వేళ మరుగుదొడ్లను మూసివేయడంతో ముఖ్యంగా మహిళలు ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండ్‌లో మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. పంచాయతీ అధికారులు సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

చంద్రావతికి మాజీ ఎమ్మెల్యే గ్రంధి నివాళి



చంద్రావతి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం: సారికి చంద్రావతి మృతి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే, మాజీ విప్ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరంలో రెస్ట్ హౌస్ రోడ్డులోని అంబళ్ల వారి వీధిలో ఆదివారం నిర్వహించిన సంతాప సభలో మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడారు. చంద్రావతి భర్త సారికి సన్యాసిరావు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్‌గా, యశోద హాస్పిటల్ వైస్ ప్రెసిడెంట్‌గా, మాక్సివిజన్ కంటి ఆసుపత్రి వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నో సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో సరిపిడకల వెంకటేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ ఆలయంలో చక్రార్చన

భీమవరం(ప్రకాశంచౌక్): పట్టణంలోని మావుళ్లమ్మ ఆలయంలో ×పృథ్వీ శ్రీ చక్రం× వేసి చక్రార్చన పూజా కార్యక్రమాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన నవ గోపికా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పాల్గొని శ్రీ దేవి ఖడ్గమాల, ఆ తదుపరి శ్రీ లలిత సహస్ర నామ పారాయణం కార్యక్రమాలను నిర్వహించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణికి దేవస్థానం ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ మద్దిరాల మల్లిఖార్జున శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ద మహాలక్ష్మి నగేష్ శేషవస్త్రం, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో దేవదాయ ధర్మదాయ అసిస్టెంట్ కమిషనర్ ఈవీ సుబ్బారావు, ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ, తనిఖీదారు వి.వెంకటేశ్వరావు, నవ గోపికా సంఘం ప్రతినిధులు కె.సుజాత, యు.నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ ఆలయంలో శ్రీచక్రం వద్ద పూజలు నిర్వహిస్తున్న కలెక్టర్ చదలవాడ నాగరాణి



హోంగార్డుల పనితీరు ప్రశంసనీయం

భీమవరం: పోలీస్ శాఖలో హోంగార్డుల పనితీరు ప్రశంసనీయమని, పోలీసులతో సమానంగా నిరంతరం విధులు నిర్వహిస్తూ హోంగార్డులు అందిస్తున్న సేవలు అమోఘమని వన్‌టౌన్ సీఐ నాగరాజు అన్నారు. శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో హోంగార్డ్స్ ఏర్పాటు దినోత్సవాన్ని నిర్వహించారు. సీఐ నాగరాజు మాట్లాడుతూ వరదలు సంభవించినప్పుడు, ఎన్నికల సమయంలో రోజువారీ విధుల్లో హోంగార్డ్ ఆఫీసర్స్ అంకిత భావంతో సేవలందిస్తున్నారన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలకు రక్షణ కల్పించడంతో బాధ్యతాయుతమైన సేవలు అందించడంతో పాటు పొరుగు రాష్ట్రాలలో ఎన్నికల బందోబస్తులలో అప్పటించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించారని వారి సేవలను కొనియాడారు. న్యాయవాది ఉండపల్లి రమేష్ నాయుడు మాట్లాడుతూ పోలీస్ శాఖలో పని చేసే ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ హోంగార్డ్స్ ఏర్పాటు దినోత్సవాన్ని పురస్కరించుకుని విధుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 13 మంది హోంగార్డ్స్‌లను సత్కరించామన్నారు. కార్యక్రమంలో చల్లా రాము, గోపిశెట్టి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డులను సత్కరిస్తున్న దృశ్యం

15న రాష్ట్రస్థాయి పాటల పోటీలు

ఆకివీడు: స్థానిక సరిగమ సంగీత పరిషత్ 25వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 15న రాష్ట్ర స్థాయి పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.కోటేశ్వరరావు(పాటల కోటి) చెప్పారు. పరిషత్ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాటతో ఎంతో మంది గాయనీ గాయకులకు ఒక వేదికగా నిలిచి, వారి ఉన్నతికి తమ సంస్థ తోడ్పడిందన్నారు. ఈ సందర్భంగా సరిగమ జీవన సాఫల్య పురస్కారాలను ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఎం.కె.రాము, కళాకారులు సంజీవి, సంగీత సాహిత్య ఆరాధకుడు కేవీ రావు, సీతామహాలక్ష్మి, రాయప్రోలు భగవాన్, పల్లి అప్పిరెడ్డి, డాక్టర్ ఎంవీ సూర్యనారాయణరాజు, డాక్టర్ పీవీ ప్రతాప్‌కుమార్‌లను సత్కరించనున్నట్లు చెప్పారు. రాష్ట్ర స్థాయి పాటల పోటీలను స్వర్గీయ ఘంటసాల చిన్నకోడలు కృష్ణకుమారి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తారని కార్యకవర్గ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో అట్లూరి రంగారావు, కొల్లి వెంకన్నబాబు, బొబ్బిలి బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.



పాటల పోటీల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న పరిషత్ ప్రతినిధులు

వీరవాసరంలో ఉచిత ధ్యాన శిక్షణ

వీరవాసరం: మండల పిరమిడ్ స్పిరిట్యూవల్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక సీతారామస్వామి దేవస్థాన ప్రాంగణంలో ఆదివారం ఉచిత ధాన్య శిక్షణ కార్యక్రమాన్ని పిరమిడ్ మాస్టర్లు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఏలూరు పిరమిడ్ మాస్టార్ నంబూరి సావిత్ర పాల్గొని జ్ఞాన బోధన చేశారు. అనంతరం ధ్యాన శిక్షణ అందజేశారు. ధ్యాన సాధన ద్వారా మన లోపాలు సరిచేసుకోవచ్చునని, సరైన జీవనాన్ని సాగించవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కోర్డినేటర్ కేవీడీ ప్రసాద్, వర్రీ విశ్వేశ్వరరావు, తీడ నాగరాజు, కె.మోహన్‌కుమార్, మేడిశెట్టి కృష్ణారావు, ఉదయ్, కృష్ణవేణి, సావిత్రి, పైడమ్, నకెళ్ళ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



జ్ఞాన బోధన, ధ్యాన శిక్షణ నిర్వహిస్తున్న దృశ్యం

శయన మందిర అద్దాల మండపం ప్రారంభం

ఆకివీడు: స్థానిక వల్లీ దేవ సేనసమేత కల్యాణ సుబ్రహ్మణ్యేశ్వరుడి ఆలయం వద్ద నూతనంగా నిర్మించిన శయన మందిర అద్దాల మండపాన్ని ఆదివారం ప్రముఖ పారిశ్రామిక వేత్త చుండూరి వెంకట్రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మహిమ కలిగిన సుబ్రహ్మణ్యేశ్వరుడి ఆలయానికి 250 ఏళ్ల చరిత్ర ఉందన్నారు. కోరిన కోర్కెలు తీర్చే స్వామి పురాతన ఆలయాన్ని దాతల సహకారంతో పునర్నిర్మించిన షష్ఠి ఉత్సవాల్ని ఘనంగా నిర్వహించిన కమిటీని అభినందించారు. ఆలయం వద్ద ఉదయం స్వామి వారి వేలాయుధ స్నాన ఘట్టం అత్యంత వైభవంగా జరిగింది. రాత్రి స్వామి వారి పవళింపు సేవ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ చైర్మన్ నేరెళ్ల రామకృష్ణ, సభ్యులు మోరా జ్యోతి శ్రీనివాసరెడ్డి, మన్నే పోతరాజు, మోటుపల్లి రామకృష్ణ, కిమిడి నాగరాజు, సన్నిధి మాణిక్యాలరావు, కుంకట్ల దానయ్య, తదితరులు పాల్గొన్నారు. అర్చకులు మొవ్వా సుబ్రహ్మణ్యరవి, రామకృష్ణ ఆధ్వర్యంలో షష్ఠి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అద్దాల మండపాన్ని ప్రారంభిస్తున్న పారిశ్రామిక వేత్త చుండూరి వెంకట్రావు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

కాళ్ల: సుమారు 25 ఏళ్ల క్రితం పదో తరగతి చదువుకున్న విద్యార్థుల కలయికకు కాళ్ల జడ్పీ హైస్కూల్ వేదికైంది. 1999–2000 ఏడాదిలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఒకచోటికి చేరుకున్నారు. 25 ఏళ్ల తరువాత కలుసుకున్న వారంతా ఒకచోట చేరి ఆత్మీయ పలకరింపులతో యోగక్షేమాలు తెలుసుకుంటూ ఆనందంగా గడిపారు. సుమారు 170 మంది పూర్వ విద్యార్థులు వారి పిల్లలు కుటుంబ సభ్యులతో హాజరవడంతో పాతశాల ప్రాంగణమంతా కోలాహలంగా మారింది.

మందకొడిగా ధాన్యం కొనుగోళ్లు



వెలగలవారిపాలెంలో గోస్తనీ కాలువ గట్టున నెట్టిలు కట్టిన ధాన్యం బస్తాలు



రైసు మిల్లువద్ద రోడ్డుపైనే నిలిచిపోయిన ధాన్యం లోడుతో ఉన్న వాహనాలు

పెనుమంట్ర: ఇటీవల తుఫాన్ ప్రభావంతో వరికోతలు నిలిచి, ధాన్యం మాసూళ్లు పూర్తిస్థాయిలో జరగకపోవడంతో ముందుగా మాసూళ్లు జరిగిన రైతులు ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా రైసుమిల్లులకు తరలిస్తున్నారు. రెండు రోజులుగా ముమ్మరంగా కోత మెషీన్‌లతో ధాన్యాన్ని మాసూళ్లు చేసిన రైతులు సంచులుకోసం రైతు సేవా కేంద్రాలకు పోటెత్తడంతో ఆయా కేంద్రాల్లో సంచుల కొరత ఏర్పడింది. దీంతో ముందుగా నమోదు చేయించుకున్న రైతులకు రెండు రోజుల్లో సంచులు సరఫరా చేస్తామని స్థానిక అధికారులు చెబుతుండగా ముందుగా ధాన్యం మాసూళ్లు చేసి రైస్‌మిల్లులకు తరలిస్తున్నా అక్కడ దిగుమతి కాకపోవడంతో రోజుల తరబడి అక్కడ వాహనాలు రోడ్లపై ధాన్యం లోడుతో నిరీక్షించాల్సి వస్తుంది. కొన్ని రైసు మిల్లులు అయితే టార్గెట్‌లు పూర్తయ్యాయని, తాము మరో రైసు మిల్లుకు పంపిస్తామని రైతులకు కొద్దిరోజులు డబ్బులు పడే విషయం ఆలస్యం కావచ్చని కొందరు దళారులు రైతులను మభ్యపెడుతున్నారు. దీంతో కాలువగట్టుపైన రోడ్లమీద ధాన్యం బస్తాలు నెట్టిలు కట్టి దర్శనమిస్తున్నాయి.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

పాలకొల్లు అర్బన్: విద్యారంగ సమస్యలను సీఎం చంద్ర బాబు పరిష్కరించాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతి విషయాన్ని రాజకీయంగా ప్రచారం చేసుకోవడం అలవాటుగా మారిన చంద్రబాబు విద్యార్థుల తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన మెగా పేరెంట్స్ మీట్‌ను ప్రచారం కోసమే వాడుకున్నారని తేలిపోయిందని పేర్కొన్నారు. దిశా నిర్దేశం లేకుండా ఏమి ఆశించి ఆత్మీయ సమావేశాలు నిర్వహించారో? విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఏ ఫీడ్ బ్యాక్ తీసుకున్నారో చెప్పాలని ఆయన నిలదీశారు. చంద్రబాబు హాజరైన బాపట్లలోని తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశంలో తల్లికి వందనం అమలుకి ప్రకటన చేస్తారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆశించినా ఎలాంటి ప్రకటన చేయకుండా నామమాత్రంగా కార్యక్రమాన్ని నిర్వహించి వెళ్లిపోవడంతో తల్లిదండ్రులు నిరాశకు గురయ్యారన్నారు. మాజీ సీఎం జగన్ రాష్ట్రంలోని అనేక పాఠశాలలను నాడు నేడు పథకంలో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు.



కుంచిలపల్లి వినిస్టన్‌బాబు

వ్యక్తిపై దాడి

భీమవరం: రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో బలుసుమూడిలోని జి.లక్ష్మణరావుపై ముగ్గురు వ్యక్తులు దాడి చేశారని పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం తెల్లవారు జామున జి లక్ష్మణరావు ఇంటికి ముగ్గురు వ్యక్తులు వెళ్లి అతని తలపై ఇనుప రాడ్డుతో కొట్టారు. అనంతరం గుమ్మంలో ఉంచిన ద్విచక్రవాహనం, ఆటోపై పెట్రోలు పోసి అంటించారు. దీంతో బాధితుడు జి. లక్ష్మణరావు ఫిర్యాదు మేరకు ఎస్సై రెహమాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

వీరవాసరం: సీపీఎం జిల్లా మహాసభలు భీమవరంలో ఈ నెల 20,21,22 తేదీల్లో జరుగుతాయని ఆయా సభలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు జుత్తిగ నరసింహమూర్తి అన్నారు. స్థానిక కార్యాలయంలో పోతుల మృత్యుంజయ అధ్యక్షతన ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ వీరావసరంలోనూ, 23 పంచాయితీ గ్రామాల్లో ఆటో, మైక్ ద్వారా పార్టీ విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్నాయని వాటి నిర్ణయాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని తెలిపారు. మండల నాయకులు బోర అలమహారాజు, యలబండి నారాయణమూర్తి, కిలాడి సత్యనారాయణ, యండమూరి సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రతిభావంతులను ప్రోత్సహించాలి

భీమవరం: ప్రతిభ ఉన్న పేద విద్యార్థులను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరంలోని బ్యాంకు కాలనీలో ఎమ్మెల్యే అంజిబాబు నివాసం వద్ద పేద విద్యార్థికి జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం రూ. 15 వేలు ఆర్థిక సహకారం అందించారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి సేవలను కొనియాడారు. విద్యార్థికి రైస్ మిల్లర్ల తుమ్మలపల్లి శివ, డాక్టర్ రాయసం నరేష్, డాక్టర్ కిరణ్‌ల సహకారంతో రూ. 15 వేలు అందించారు. ఈ కార్యక్రమంలో కారుమూరి సత్యనారాయణమూర్తి ఉన్నారు.

మిల్లుల వద్దే సంచులు ఇవ్వాలి

ఆకివీడు: ధాన్యం కొనుగోలు సమయంలో రైతులకు మిల్లుల వద్దే సంచులు అందజేసే విధంగా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదర్శ రైతు నంద్యాల చల్లారావు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల వద్ద నుంచి సంచులు తీసుకునే విధానం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఆర్‌ఎస్‌కేల వద్దకు వెళ్లి సంచులు తెచ్చుకుని ధాన్యాన్ని మిల్లులకు చేరవేయడం వల్ల ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. ఆర్‌ఎస్‌కేల వద్ద ఇచ్చే సంచుల్లో నాసిరకం వస్తున్నాయన్నారు. దీనివల్ల మళ్లీ ఆర్‌ఎస్‌కేల వద్దకు వచ్చి వాటిని మార్చుకోవాల్సి వస్తుందని పేర్కొన్నారు.

నడకతోనే సంపూర్ణ ఆరోగ్యం

పెనుగొండ: నానాటికీ మారుతున్న ఆహారపు అలవాట్లు, జీవన శైలితో రోగాల బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి నడక శరణ్యమవుతుందని వైద్యు లు సూచిస్తున్నారు. దీంతో వాకింగ్‌పై నానాటికి దృష్టిసారించే వారి సంఖ్య పెరుగుతూ వస్తుంది. పట్టణాలు మొదలుకుని చిన్న గ్రామాల వరకూ ఉదయం సాయంత్రం నడిచేవారి సంఖ్య పెరుగుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో మధుమేహం, గుండెపోటు, ఊబకాయం వంటి వ్యాధుల బారిన పడేవారి సంఖ్య అధికంగా ఉంది. దీంతో వీటికి నడకే దివ్య ఔషధంగా బావించి నడకకు ప్రాధాన్యం ఇస్తున్నారు. వీటి భారిన పడి మందులకు ఆర్థికంగా మరింత నష్టపోవడం కన్నా, ఉదయం సాయంత్రం నడకు సమయం కేటాయించి ఆరోగ్యాన్ని రక్షించుకుంటున్నారు. చిన్న వయస్సు వారి నుంచి పెద్ద వయస్సు వారు సైతం వాకింగ్ చేయాలనే తలంపుతో ప్రతిరోజు వాకింగ్ చేస్తున్నారు. వీరి కోసం కొన్ని ప్రాంతాల్లో ప్రత్యేక ట్రాక్‌లు సైతం ఏర్పాటు చేస్తున్నారు. దీనిలో భాగంగా పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర కేఎస్‌రాజు కళాశాలలోలనూ. పెనుగొండ పంచాయతీ పార్కు వద్ద, ఆచంట ఎంవీఆర్ కళాశాల వద్ద, పంచాయతీ చెరువు వద్ద, సిద్ధాంతం ఏటిగట్టు నుంచి జాతీయ రహదారి వరకూ, మార్టేరు ఎస్వీజీ ఉన్నత పాఠశాల వద్ద వాకింగ్ చేసే వారి సంఖ్య నానాటికీ పెరుగుతుంది.



పెనుగొండ ఎస్వీకేపీ గ్రౌండ్‌లో వాకింగ్ చేస్తున్న వాకర్స్



పెనుగొండ ఎస్వీకేపీలో వామప్ అవుతున్న వాకర్స్

వాకింగ్‌తో ప్రయోజనాలెన్నో

వాకింగ్‌తో సుగర్, గుండెజబ్బులు, బీపీ, క్యాన్సర్లు వచ్చే అవకాశాలు తక్కువగా ఉండడంతో పాటు, నియంత్రణలో ఉంటాయి. రోజూ ఉదయం, సాయంత్రం గంట పాటు వాకింగ్ చేయడం వల్ల ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. మానసిక ఒత్తిడిని నివారించడంతో పాటు, ప్రశాంతతు కల్పించడానికి వాకింగ్ ఉపయోగపడుతుంది. ఊబకాయం తగ్గడంతో పాటు, రక్త ప్రసరణ సరిగ్గా జరగడానికి దోహద పడుతుందంటూ వైద్య నిపుణులు చెబుతున్నారు.

ప్రత్యేక క్లబ్‌లు

ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రారంభించిన వాకింగ్ స్నేహబంధాన్ని పెంచుతుంది. ఎక్కడెక్కడి వారో తెల్లవారుతుండగానే ఒకరికొకరు పలకరించుకుంటూ ఉత్సాహంగా వాకింగ్ చేస్తున్నారు. కొన్ని మండలాల్లో అయితే వాకర్స్ క్లబ్‌లు సైతం ఏర్పాటు చేసి స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్లబ్‌ను జిల్లా వ్యాప్తంగా అనుసంధానం చేసుకొంటూ ప్రఖ్యాత క్లబ్‌లైన లయన్స్, రోటరీ, మానవత వంటి స్వచ్ఛందసంస్థలకు దీటుగా స్వచ్ఛంద సేవలు అందిస్తూ మన్ననలు పొందుతున్నారు.

మానసిక ప్రశాంతత చేకూరుస్తుంది

వాకింగ్ ఆరోగ్యానికి దోహద పరచడంతో పాటు, మానసిక ప్రశాంతత కల్పిస్తుంది. ఉదయం సాయంత్రం ఎందరో వాకింగ్‌లో పాల్గొంటూ స్నేహ బందాన్ని పటిష్ఠం చేసుకుంటున్నాం. వాకింగ్ 10 ఏళ్లకు పైగా చేస్తున్నా. ప్రతి ఒక్కరూ సోదర భావంతో వాకింగ్ చేస్తుండడంతో మానసిక ఒత్తిడి దూరమై ప్రశాంతంగా ఉంటుంది.



– కాకర శశికుమార్, ఆంగ్ల అధ్యాపకుడు, ఎస్వీకేపీ కళాశాల, పెనుగొండ

జీవనశైలిలో మార్పులు

నిత్యం ఉదయం సాయంత్రం నడకతో జీవన శైలిలో మార్పులు వచ్చాయి. ఎనిమిదేళ్లుగా నిత్యం వాకింగ్ చేస్తున్నా. అత్యవసరమైతే తప్ప మానకుండా నిత్యం వాకింగ్ చేస్తున్నా. రోజుంతా ఉల్లాసంగా గడపడానికి వాకింగ్ ఉపయోగ పడుతంది. ప్రతి ఒక్కరూ వాకింగ్ చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి.



– కె.సూర్యనారాయణ, మానవత, పెనుగొండ

యోగా పోటీల్లో ప్రతిభ

పాలకొల్లు సెంట్రల్: ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరంలో నిర్వహించిన అంతర్ కళాశాలల యోగా పోటీల్లో విద్యార్థిని చెల్లూరి మాధవి ప్రతిభ కనభరచడం అభినందనీయమని డీఎన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ డా. శోభారాణి అన్నారు. ఆదివారం దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థిని మాధవిని అభినందించారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ శుక్రవారం నన్నయ్య యూనివర్శిటీలో జరిగిన పోటీల్లో యూనివర్సిటీ స్థాయిలో నాలుగో స్థానం సాధించిందన్నారు. ఈ నెల 24 నుంచి ఒరిస్సాలో కళింగ విశ్వవిద్యాలయంలో జరగనున్న జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా పీఈటీ లంకలపల్లి రమేష్, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థిని మాధవిని అభినందించారు.



మాధవిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శోభారాణి

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరుని రథోత్సవం

యలమంచిలి: మండలంలోని గుంపర్రులో శ్రీవల్లి దేవసేనా సహిత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాల్లో ఆదివారం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. అర్చకులు కొమాళ్లపల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో ఉదయం అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం మంగళ వాయిద్యా లు, బాణసంచా కాల్పుల మధ్య రథోత్సవం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం పల్లకి ఉత్సవం నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు వివరించారు.



రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. అయ్యప్ప, భవానీ మాలధారులు పెద్ద ఎత్తున తరలిరావడంతో అమ్మవారిని ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈఓఎం.అరుణ్ కుమార్, ఆలయ, చైర్మన్ కడలి మాణిక్యాలరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

భీమవరం డివిజన్

90102 23729

79955 66351

90108 51166

Office mail : tpgadvt@gmail.com